నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
సోమవారం | ఆగస్టు 19, 2024 | www.navatelangana.com

ఉదారత చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్

నవతెలంగాణ-బోథ్

నిర్మల్ డిపోకు చెందిన డ్రైవర్ రమేష్, కండక్టర్ బేర శ్రీదేవి తమకు దొరికిన పర్సును సంబంధిత వ్యక్తికి ఇచ్చి ఉదారత చాటుకున్నారు. నిర్మల్ నుంచి బోథ్‌కు వస్తున్న బస్సులో లఖంపూర్‌కు చెందిన పెందూర్ సుజాత ఎక్కింది. హడావుడిలో పర్సు బస్‌లోనే మరిచిపోయి గ్రామంలో దిగిపోయింది. పర్సును కండక్టర్ గమనించి బోథ్ ఆర్టీసీ కంట్రోలర్ మల్లెపూల సుదర్శన్‌కు అందించి బాధితురాలికి సమాచారం ఇచ్చారు. ఉదారత చాటుకున్న కండక్టర్, డ్రైవర్‌ను పలువురు అభినందించారు.



మాజీ జెడ్పీటీసీ, ఎంపీపీకి సన్మానం

నవతెలంగాణ-తలమడుగు

పదవీ కాలం పూర్తి చేసుకున్న మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డిని, మాజీ ఎంపీపీ లక్ష్మీరాజేశ్వర్‌ను ఆదివారం దేవాపూర్ గ్రామ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా గణేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తామని తెలిపారు. రైతులకు 100 శాతం రుణమాఫీ అవుతుందని, రైతులు ప్రతిపక్ష పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం సభ్యులు రమేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, గ్రామస్తులు తిరుపతి, వెంకన్న, నర్సిములు, లచ్చన్న, పోశెట్టి పాల్గొన్నారు.



మాఫీ సమస్యలు..పరిష్కారంపై ఆశలు..!

- అర్హులైనప్పటికీ అనేక మందికి రుణమాఫీ దూరం
- సాంకేతిక లోపాలు.. బ్యాంకర్ల తప్పిదాలే కారణం
- పలు చోట్ల కొనసాగుతున్న రైతుల నిరసనలు
- ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

రుణమాఫీలో తలెత్తిన సమస్యలు ఇటు రైతులను, అటు ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రైతులకు అవసరమైన నిధులు ఖాతాల్లో జమ చేశామని ప్రభుత్వం చెబుతుండగా.. వివిధ సాంకేతిక సమస్యలు..బ్యాంకర్ల తప్పిదాల మూలంగా అన్నదాతల దరికి చేరకపోవడం ఆందోళనకు దారితీస్తోంది. తొలి, రెండో విడతలో తలెత్తిన సమస్యలే మళ్లీ మూడో విడత రుణమాఫీలోనూ చోటు చేసుకోవడం అన్నదాతల ఆందోళనకు కారణమైంది. మరోపక్క సాంకేతిక సమస్యల కారణంగా కొందరు రైతులకు రుణం మాఫీ కాకపోగా.. బ్యాంకు అధికారుల తప్పిదాల కారణంగా మరికొంత మంది ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క రూ.2లక్షల వరకు రుణమాఫీ చాలా మందికి వర్తించకపోవడం తాజాగా ఉమ్మడి జిల్లాలో రైతుల ఆందోళనకు కారణమవుతోంది. ప్రభుత్వం వీటిని పరిగణనలోకి తీసుకొని త్వరగా పరిష్కరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



తలమడుగు మండలం రుయ్యాడిలో సీఎం దిష్టిబొమ్మకు శవయాత్ర

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీలో తలెత్తిన గందరగోళ ప్రక్రియ మరింత రాజుకుంటోంది. గ్రామాల్లో రుణమాఫీ వర్తించని రైతులు తీవ్ర నిరాశలో ఉండగా.. వారంతా ప్రభుత్వ వైఖరిపై నిరసనలు తెలిపేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే తలమడుగు, జైనథ్ మండల కేంద్రాల్లో అన్నదాతలు నిరసన చేపట్టగా.. తాజాగా తలమడుగు మండలం రుయ్యాడిలోనూ ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం ప్రస్తుతం మూడో విడతలో రూ.2లక్షల వరకు రుణం కలిగిన వారికి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. రూ.2లక్షలకు పైగా ఉన్న వారికి త్వరలోనే వేస్తామని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. కానీ రూ.2లక్షల వరకు రుణం కలిగిన రైతులకు సైతం అనేక మందికి డబ్బులు ఖాతాల్లో జమ కాలేదు. మాఫీ జాబితాలో పేర్లు లేకపోవడంతో తీవ్ర నిర్వేదానికి గురవుతున్నారు. మరోపక్క రుణమాఫీ తొలి, రెండో విడతలకు సంబంధించి తలెత్తిన సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు భరోసా ఇచ్చారు. సహాయ కేంద్రాలు ఏర్పాటుచేసి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని నమోదు చేసుకున్న వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి పంపించారు. కానీ మూడో విడత వచ్చినప్పటికీ వాటి పరిష్కారంలో జాప్యం జరిగింది. మరోపక్క తాజాగా మూడో విడతలోనూ వివిధ కారణాల చేత రుణమాఫీ జరగకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. తొలి, రెండో విడతనే కాకుండా మూడో విడతలోనూ మాఫీ ప్రక్రియలో గందరగోళం ఏర్పడటంతో అన్నదాతల్లో అసంతృప్తి వ్యక్తమయ్యేందుకు కారణమవుతోంది.

ఆ బ్యాంకుల్లోనే సమస్య..!

ఉమ్మడి జిల్లాలో వివిధ బ్యాంకుల్లో ఖాతాలు కలిగిన రైతులకు రుణమాఫీ డబ్బులు జమ అయ్యాయి. ఇందులో కొన్నిచోట్ల సాంకేతిక సమస్యల కారణంగా మాఫీ జరగకపోగా.. అధికశాతం మంది రైతులకు రెండు విడతల్లో చేసిన రుణమాఫీ సంతోషాన్నిచ్చింది. కానీ మూడో విడతలో పెద్ద ఎత్తున సమస్యలు వచ్చాయి. ముఖ్యంగా మహారాష్ట్ర బ్యాంకుల్లో ఖాతాలు కలిగిన రైతులకే ఎక్కువ సమస్యలు రావడంతో ఆ బ్యాంకు అధికారుల తప్పిదాల మూలంగా అన్నదాతలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో ఐదు మహారాష్ట్ర బ్యాంకులు ఉండగా.. నిర్మల్ జిల్లాలో ఒకటి ఉంది. వీటిలో ఖాతాలు కలిగిన అనేక మంది రైతులు రుణమాఫీ జరగకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు రైతులకు ఖాతాల్లో తక్కువగా పడటం.. వంటి సమస్యలు ఉన్నాయి. మిగితా బ్యాంకుల్లో ఆధార్, రుణఖాతాల్లో పేర్లలో తేడాలు ఉండటం, నిర్ధారణ కావడం లేదని రావడం తదితర కారణాలతో రుణమాఫీకి ఆటంకం ఏర్పడినట్లు అధికారులు చెబుతున్నారు. కేవలం ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే ఇప్పటి వరకు 600 వరకు ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. మూడో విడతలో ఈ సమస్యలు మరిన్ని వచ్చేటట్లు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం వీటిపై దృష్టిసారించి త్వరగా పరిష్కరించాలని అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం సైతం అర్హులైన అందరికీ వర్తింపజేస్తామని చెబుతుండటంతో అనేక మంది రైతులు భరోసాతో ఉన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు : పుల్లయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, ఆదిలాబాద్



జిల్లాలో రుణమాఫీకి అర్హులైన రైతులు ఎవరూ ఆందోళనకు గురికాకూడదు. సాంకేతిక సమస్యల కారణంగా జాబితాలో పేర్లు లేకపోవడం వంటి సమస్యలు వచ్చినట్లు మా దృష్టికి వచ్చింది. రైతులు ఏఈఓల దృష్టికి తీసుకెళ్లాలి. జిల్లా కార్యాలయంలో సహాయవాణి కేంద్రం కూడా ఏర్పాటుచేశాం. ఫిర్యాదులను పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాము. అర్హులైన వారందరికీ మాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటాం.

రైతులందరీ రుణాలు త్వరలో మాఫీ చేయాలి

- లేనిపక్షంలో జిల్లా కేంద్రంగా 23న రైతులతో ధర్నా
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

పెండింగ్‌లో ఉన్న రైతుల రుణాలను త్వరలో మాఫీ చేయాలని, లేనిపక్షంలో జిల్లా కేంద్రంలో ఈ నెల 23న రైతులతో పెద్ద ఎత్తున ధర్నాకు దిగుతామని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తమ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు ఇవ్వాల్సిన నిధులనే రుణమాఫీకి డైవర్ట్ చేసిందని తెలిపారు. ఇప్పటికే రెండు పంటలకు రైతు భరోసా సాయం ఇవ్వకుండా ఎగ్గొట్టారని విమర్శించారు. రైతు భరోసా ఎప్పుడు ఇస్తారో సర్కార్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ రైతులను మరోసారి మోసం చేసిందని విమర్శించారు. 60 లక్షల మంది రైతులు అర్హులుండగా కేవలం 22లక్షల మందికే రుణమాఫీ చేశారని వెల్లడించారు. రూ.49వేల కోట్లు రుణమాఫీకి ఇవ్వాల్సిఉండగా కేవలం రూ.17వేల కోట్లే ఇచ్చారని మండిపడ్డారు. రుణమాఫీ కాని రైతులను మోసం చేసేందుకే దరఖాస్తులు చేసుకోమంటున్నారని, ఇదీ మోసమేనని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయలేకనే రేవంత్ సర్కార్ చేతులెత్తేసిందని విమర్శించారు. రైతులందరికీ రుణాలు మాఫీ చేసామంటున్న సిఎం తమ రుణాలు మాఫీ కాలేదంటూ క్షేత్ర స్థాయిలో నిరసనలు తెలుపుతున్న రైతులకు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దమ్ముంటే గ్రామాలకు వెళ్లి పూర్తి స్థాయిలో రైతులకు రుణాలు మాఫీ అయ్యాయో లేదో ఆరా తీయాలని సవాల్ విసిరారు. మూడు విడతల్లో రుణమాఫీ చేసిన రైతుల వివరాలు వారం రోజుల్లోగా ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న రైతుల రుణాలను ప్రభుత్వం త్వరలో మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ఖరీఫ్ సీజన్ డబ్బులను ఈ నెలాఖరులోగా రైతులకు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని ఇటిక్యాల ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టుకున్నామని సీఐ అల్లం నరేందర్ తెలిపారు. వారి వద్ద నుండి 250 గ్రాముల గంజాయి, 2బైకులు, 2సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామని తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తిమ్మాపూర్‌కు చెందిన ముత్తినేని చంద్రమౌళి, మహారాష్ట్రలోని బల్లర్పూర్‌కు చెందిన ఆర్బాస్‌ఖాన్‌ను రెండో ఎస్ఐ రాజయ్య, సిబ్బందితో కలిసి మాటు వేసి పట్టుకున్నారని పేర్కొన్నారు. మహారాష్ట్ర బల్లర్పూర్ నుండి లక్షెట్టిపే ప్రాంతానికి గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి విచారణ జరుపుతున్నామని, గంజాయి విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని సీఐ నరేందర్, ఎస్ఐ పి.సతీష్ పేర్కొన్నారు.

వినాయక్‌రావు ట్రస్ట్ సేవలు అభినందనీయం



నవతెలంగాణ-బోథ్

పదో తరగతిలో ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించిన మండల కేంద్ర ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆదివారం వినాయక్‌రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో కోర్టు భవనంలో ఒక్కొక్కరికి రూ.7000 చొప్పున ఏడుగురు విద్యార్థులకు రూ.50000 ప్రోత్సాహక బహుమతిని జడ్జి బి.హుస్సేన్, రిటైర్డ్ జడ్జి శ్యాంమోహన్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో విద్యతో ఏదైనా సాధించొచ్చని తెలిపారు. మారుమూల గ్రామాల్లో ట్రస్ట్ సేవలందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు వామన్‌రావ్ దేశ్ పాండే, సెక్రటరీ అంబదాస్, న్యాయవాదులు మోహన్‌రావ్, సుభాష్, పంద్రం శంకర్, ఆడెపు హరీష్, అంగద్ కేంద్రే, ఎట్టం రాములు, ఉపాధ్యాయుడు పోశెట్టి, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రైతులను నిండా ముంచింది

పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలంటూ బీఆర్ఎస్, బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు



నవతెలంగాణ-బేల

రూ.2లక్షల పంట రుణాలను మాఫీ చేస్తామని ఓట్లు దండుకుని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా ముంచిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి అన్నారు. రుణమాఫీలో నెలకొన్న గందరగోళ పరిస్థితులను వెంటనే సవరించి ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతు పంట రుణం వెంటనే మాఫీ చేయాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సిర్సన్న వద్ద బేల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై బైటాయించి రాకపోకలను అడ్డుకున్నారు. ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సీఐ సాయినాథ్, ఎస్ఐ రాధిక రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. రుణమాఫీ అమలు కాని రైతులకు భరోసా కల్పించాలంటూ ఆందోళనకారులు పట్టుబట్టారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను బలవంతంగా పక్కకు తప్పించి రాకపోకలను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ప్రమోద్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను దగా చేస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి రైతులు రుణాలు తీసుకోవాలని, అధికారంలోకి వచ్చాక వాటన్నింటిని మాఫీ చేస్తామని చెప్పారని తెలిపారు. పదవీ దక్కాక నిబంధనల సాకుతో సగం మంది రైతులను రుణమాఫీ పథకానికి దూరం చేశారన్నారు. రుణాలు మాఫీ కాక రైతులంతా రోడ్లపైకి వస్తుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం పాలాభిషేకాలు చేస్తూ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే ప్రతి రైతు పంట రుణం మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సతీష్ పవార్, దేవన్న, జక్కుల మధుకర్, విపిన్ ఠాక్రే, దీపక్‌గౌడ్, గోదూరి భూమన్న, బోయర్ తిరుపతి, క్యాతం సురేష్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

రైతాంగాన్ని మోసం చేసిన ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేదని, రుణమాఫీ అమలు విఫలం చెందిన రేవంత్‌రెడ్డి సర్కార్ మూల్యం చెల్లించక తప్పదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాంపల్లి వేణుగోపాల్ అన్నారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ జరగకపోవడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని శివాజిచౌక్ వద్ద రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. రహదారిపై బైటాయించి సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళన విరమింపజేసేందుకు యత్నించిన సీఐ సాయినాథ్, ఎస్ రాధికతో వాగ్వాదానికి దిగారు. రైతులకు జరిగిన అన్యాయంపై అధికారులు సమాధానం చెప్పాలని పట్టబట్టారు. రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు ఆందోళనకారులను బలవంతంగా పక్కకు తప్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ ఠాక్రే, మాజీ సర్పంచ్ ఇంద్రశేఖర్, నాయకులు మోరేశ్వర్, రాకేశ్, నవీన్, మహేష్, గణేష్, శివకుమార్ పాల్గొన్నారు.



పింఛన్ల పెంపు హామీని వెంటనే అమలు చేయాలి

- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య



నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఆసరా పెన్షన్స్ పెంచుతామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, పెన్షన్లకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.300ను రూ.5000కు పెంచాలని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య కోరారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా 2వ మహాసభ టీఎన్జీవో భవన్‌లో ఆదివారం జిల్లా అధ్యక్షులు ఫసీయోద్దీన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడారు. పెన్షన్లకు కేంద్ర ప్రభుత్వం 2011 నుండి కేవలం రూ.300 వాటా ఇస్తోందన్నారు. రూ.300తో ఎలా బతికేదని ప్రశ్నించారు. నిత్యావసర సరకుల ధరలు గడిచిన 13ఏండ్ల కాలంలో 300 రేట్లు పెరిగాయని, ధరల పెరుగుదల సూచికి అనుగుణంగా పెన్షన్స్ ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అంటున్న కేంద్ర ప్రభుత్వం పెన్షన్స్ ఎందుకు పెంచడం లేదన్నారు. పెన్షన్లలో కేంద్ర ప్రభుత్వం వాటా పెంచకుండా వికలాంగుల గురించి మాట్లాడే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వికలాంగుల రూ.6000, వృద్ధులు, వితంతువులతో పాటు ఇతర పెన్షన్స్ రూ.4000కు పెంచుతామని హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి 9నెలలు గడుస్తున్నా పెన్షన్స్ పెంపు గురించి మాట్లాడడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయం కోసం 44,49,767 మంది ఆసరా లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారన్నారు. 2024 జనవరి నుండే పెంచిన పెన్షన్స్ అమలు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వికలాంగులకు ఉచిత బస్ ప్రయాణం, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, 2016 ఆర్‌పిడబ్ల్యుడి చట్టం అమలు వంటి వాటిని వెంటనే అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాలపరిమితి ముగిసిన సదరం సర్టిఫికెట్స్ వెంటనే రెన్యూవల్ చేయాలన్నారు. వేలాది మంది సదరం సర్టిఫికెట్లపై డాక్టర్స్ సంతకాలు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. ప్రస్తుతం క్యాంపు నిర్వహిస్తున్న డాక్టర్స్ సంతకాలు పెట్టే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. 2016 ఆర్‌పిడబ్ల్యుడి చట్టం కొత్తగా గుర్తించిన 14రకాల వైకల్యాలకు సదరం సర్టిఫికెట్స్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తలసేమియా, సికిల్‌సెల్, హేమోఫీలియా, అంటీజం, కండరాల క్షీణత, న్యూరోలాజికల్ డిజర్డర్స్ వంటి వైకల్యాలు కలిగిన వారికి నేటికీ సదరం సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని విమర్శించారు. ఆసరా పెన్షన్‌లలో కేంద్ర ప్రభుత్వం వాటా పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు టి.శంభు, జిల్లా నాయకులు రాజేష్, కిషన్, పుష్పలత, రఫియా బేగం, పోసాని, భోజవ్వ, జగదీశ్, గంగాధర్, రాధ, రాజేశ్వర్ పలువురు వికలాంగులు పాల్గొన్నారు.

ఏఈఓ కనకరాజుకు ఘన వీడ్కోలు



నవతెలంగాణ - హాజీపూర్

మండల రైతులకు దాదాపు 19 ఏళ్లుగా సేవలు అందించిన మండల వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ) కనకరాజు మందమర్రి ఏఈఓగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం కర్ణమామిడి రైతువేదికలో పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడుతూ సత్కరించారు. 2006 నుంచి మంచిర్యాల, హాజీపూర్ ఏఈఓగా విధుల్లో నిబద్ధతగా ఉంటూ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు ఇచ్చారని పలువురు పేర్కొన్నారు. కనకరాజు భవిష్యత్తులో ఉన్నత హోదాతో రిటైర్డ్ కావాలని కోరుతూ ఘనంగా వీడ్కోలు పలికారు. సన్మాన కార్యక్రమంలలో సింగిల్ విండో చైర్మన్ కోటె సత్తయ్య, వైస్ చైర్మన్ కంది అంతయ్య, మాజీ సర్పంచ్ కొట్టె మహేందర్, మాజీ ఉప సర్పంచ్ గడ్డం ముకుందరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాయిని రాంచందర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్, మాజీ డైరెక్టర్ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు గోళ్ల తిరుపతి, గోళ్ల సత్తయ్య, గంధం మల్లేశ్, రైతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | 19 ఆగస్టు, 2024 | www.navatelangana.com

చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-జైనథ్

ఇటీవల జిల్లా కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో మరణించినటువంటి మండల కేంద్రానికి చెందిన కొంద్రు సంతోష్ కుటుంబానికి తమ పదో తరగతి 1998-99 సంవత్సర చిన్ననాటి స్నేహితులు కున్నల రవి, సామ అరవింద్‌రెడ్డి, టి.రాకేష్‌రెడ్డి, ఉష్కమల్ల శంకర్, నూకల రాములు, శివారెడ్డి బాధితుడి పిల్లలకు రూ.20వేల చెక్కును అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఎల్లవేళలా తమ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

విద్యార్థుల మధ్య జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు రాథోడ్ రాధిక తన జన్మదిన వేడుకలు వనవాసి కళ్యాణ పరిషత్ విద్యార్థుల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులచే కేక్‌ను కట్ చేయించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు తినిపించారు. అనంతరం వారికి పరీక్షకు ఉపయోగపడే ప్యాడ్లను పంపిణీ చేశారు.

సుభాష్ చంద్రబోస్ వర్ధంతి వేడుకలు



నవతెలంగాణ-ఉట్నూర్

బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం సుభాష్ చంద్రబోస్ 79వ వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ పంద్రా జైవంత్‌రావు మాట్లాడుతూ ప్రఖ్యాత భారత స్వాతంత్ర్య సమరయోధుడు, యువతరంలో స్వాతంత్ర్య కాంక్షను రేకెత్తించిన నిత్యా స్ఫూర్తి ప్రదాత, సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను హడలెత్తించిన వీరుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. అతను జాతీయ ఆజాద్ హింద్ వ్యవస్థాపకుడిగా ప్రసిద్ధి చెందాడని సుభాష్ చంద్రబోస్ సాధారణ నాయకత్వ నైపుణ్యాలను ఆకర్షణీయమైన వక్తతో అత్యంత ప్రభావంతమైన స్వాతంత్ర్య సమరయోధుడిగా పరగణించబడ్డాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ ముజీబ్, దుట మహేందర్, సిడం సోనే రావు, కుర్సెంగా భూమన్న, పిండి ప్రభాకర్, అర్జున్న పాల్గొన్నారు.

రుయ్యాడిలో సీఎం దిష్టిబొమ్మకు శవయాత్ర



నవతెలంగాణ-తలమడుగు

పట్టా పాస్ బుక్ ఉన్న రైతులందరికీ రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలంటూ ఆదివారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో రైతులు, గ్రామస్తులు సీఎం దిష్టిబొమ్మ శవయాత్రను నిర్వహించారు. సీఎం డౌన్ డౌన్ రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలంటూ నినాదాలు చేస్తూ, గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర రైతులందరికీ ఆగస్టు 15 వరకు రుణమాఫీ వర్తిస్తుందని చెప్పి రైతులను మోసగించారని అన్నారు. మాయ మాటలు చెప్పి ఇటు రైతులను, ప్రజలను మోసం చేసి గద్దెనేక్కాడని అన్నారు. వెంటనే రుణమాఫీ వర్తించని రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. తాంసి, తలమడుగు పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించి, సీఎం దిష్టిబొమ్మను నిప్పు పెట్టకముందే దిష్టిబొమ్మను లాక్కున్నారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, ప్రవీణ్, నర్సిములు, ప్రకాష్‌రెడ్డి, ధనంజయ్, లక్ష్మారెడ్డి, గంగాధర్, గణపతి, అశోక్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు సమత ఫౌండేషన్ అధ్యక్షుడు అనిల్ సాఫ్టే అన్నారు. పట్టణంలోని అశోక బుద్ధ వీహార్‌లో మహాకవి వామన్ కర్డక్ 102వ జయంతిని పురస్కరించుకొని ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి వచ్చిన పలువురు కవులు కవి సమ్మేళనంలో పాల్గొని, తమ కవితలను వినిపించారు. అంతకుముందు అంబేద్కర్, కవి వామన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమత ఫౌండేషన్ ప్రతినిధులు తుకారాం, దయానంద్, తెలంగ్ సిద్దార్థ్, విఠల్, సంగీత, కుశ్వర్త బాయి, ఉజ్వల, త్రిశుల తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-నిర్మల్

కోల్‌కతాలో ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో ఆగస్టు 8న నైట్ డ్యూటీలో ఉన్న జూనియర్ రెసిడెంట్ డాక్టర్‌ను లైంగికదాడి చేసి అతి దారుణంగా ప్రాణాలు తీసిన కామాంధులను కఠినంగా శిక్షించాలని. ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కే.లక్ష్మి మాట్లాడారు. రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు హత్యలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రక్షణ కోసం ఎన్నో చట్టాలు తెచ్చినప్పటికీ అవి నిర్వీర్యమైపోతున్నాయని అన్నారు. వైద్యుల భద్రతకు సంబంధించి, ఐఎంఏ చూపిన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని, వైద్యులకు విశ్రాంతి గదులు అలాగే సీసీ కెమెరాలు ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న, జిల్లా నాయకులు గంగామణి, లక్ష్మి, చిట్టి, తశ్రీన్, కవిత పాల్గొన్నారు.

ఏజెన్సీలో పంజా విసురుతున్న డెంగ్యూ

- పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం
- దనోరలో డెంగ్యూ కేసులు
- కానరాని దోమల స్ప్రేలు
- పీహెచ్‌సీలో మందుల కొరత

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మాన్యంలో నివసిస్తున్న ఆదివాసులపై డెంగ్యూ పంజావిసురుతోంది. దీనిని నుంచి కాపాడాల్సిన వైద్య, పంచాయతీ శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. వీరి నిర్లక్ష్యానికి ఏజెన్సీలోని అనేక మండలాల్లో జ్వరాలు పంజావిస రుతున్నాయి. వీరికి సకాలంలో ప్రభుత్వ వైద్యం అందక అప్పు సప్పు చేసి ప్రయివేటు ఆర్ఎంపీల వద్ద చికిత్సలు పొందుతున్నారు. వీరు ఎలాంటి శిక్షణ లేకుండా కేవలం కొందరు డాక్టర్ల వద్ద కంపౌండర్లుగా పనిచేసిన అనుభవంతో ఏకంగా క్లినిక్‌లు, ఫస్టేయిడ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తూ, ఎక్కువ డోసుల ఇంజెక్షన్లు, అవసరం లెక్కున్న సెలైన్ బాటిల్‌లను ఎక్కిస్తున్నారు. అధిక మొత్తంలో డబ్బులను అందినంత గుంజుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

పీహెచ్‌సీలో మందుల కొరత..

స్థానిక పీహెచ్‌సీలో టైఫాయిడ్‌కు ఉపయోగించే సేఫిక్సిమ్ వంటి మందులు గత కొన్ని నెలలుగా పంపిణీ కావడం లేదని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. దీంతో జ్వరాలు తగ్గక పోవడంతో గిరిజనులు ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

పల్లెల్లో కానరాని డీడీటీ స్ప్రేలు..

మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు ప్రబలకుండా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ముందు జాగ్రత్త చర్యగా డీడీటీ స్ప్రే చేసేవారు. కాని ప్రస్తుతం అది చేయడం లేదు. దీంతో ఎక్కడ చూసిన దోమలు విజృంభిస్తున్నాయి.

డెంగ్యూ పాజిటివ్ కేసులు..

మండలంలోని ధనోర(బి)లో గత నెలలో ఉదయ్ (6), జహన్వి (4) అనే ఇద్దరు చిన్నారులకు డెంగ్యూ వచ్చింది. ప్రజలు భయం గుప్పిట్లో కాలం వెళ్లగక్కుతున్నారు.

మూలన పడ్డ స్కానింగ్ మిషన్..

స్థానిక పీహెచ్‌సీలో గర్భవతులకు జిల్లా కేంద్రానికి వెళ్లకుండా పీహెచ్‌సీలోనే పిండం పెరుగుదల వంటి సమస్యలను తెలుసుకునే పరీక్షలు చేసేవారు. ఈ స్కానింగ్ పరికరం సైతం పనిచేయక పోవడంతో మూలన పడింది. దీంతో గర్భవతులు నానా అవస్థలు పడుతున్నారు. జిల్లా వైద్య శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఏజెన్సీలో మందులను అందుబాటులో ఉంచి గిరిజనులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆదివాసులు కోరుతున్నారు.





సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తి మరువలేనిది



నవతెలంగాణ-నిర్మల్

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి మరువలేనిదని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం కలెక్టరెట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి మరువలేనిదని కొనియాడారు. భూస్వాములు, పెత్తందార్లకు వ్యతిరేఖంగా పోరాడిన గొప్ప యోధుడని, ఇలాంటి మహనీయుల జయంతిలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. పోరాట యోధల చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. అనంతరం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటాలను వివిధ కుల సంఘ నాయకులు గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఆర్వో భుజంగ్‌రావ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, మెప్మా పీడీ సుభాష్, డీఎంహెచ్ఓ రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో...

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన పోరాటలను వివరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పొన్నం నారాయణగౌడ్, గోపి గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, సాయినాథ్, ఉదయ్‌గౌడ్, బీజేపీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మెన్ ఆధ్వర్యంలో..

బహుజన హక్కుల కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని మున్సిపల్ చైర్మెన్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం ఆయన 374వ జయంతి సందర్భంగా పురపాలక సంఘం కార్యాలయం ఎదురుగా ఉన్న విగ్రహానికి సంఘ సభ్యులు, నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, నాయకులు గౌడ కులస్తులు, పాల్గొన్నారు.

ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణంలో పాపన్నగౌడ్ 374వ జయంతి ఉత్సవాలను ఆ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా



నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్‌చౌక్‌లో ఉన్న పాపన్న గౌడ్ విగ్రహానికి పట్టణ సంఘం అధ్యక్షులు చిన్న నర్సాగౌడ్, సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాపన్న జయంతి నిర్వహణ కమిటీ రాష్ట్ర కన్వీనర్, మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు, అమరవేణి నర్సాగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసారపు మల్లాగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 374 సంవత్సరాల కింద అప్పటి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇప్పటి జనగామ జిల్లా ఖిలాశాపూర్ గ్రామంలో ధర్మన్న, సర్వమ్మలకు పాపన్న గౌడ్‌కు పుట్టారని అన్నారు. మొదట 12 మందితో సొంత సైన్యాన్ని మొదలు పెట్టి 12 వేలకు చేసుకొని బడుగు బలహీన వర్గాల ప్రజలందరి ఐక్యం చేసి భూస్వాములను, పెత్తందార్లను తరిమి కొట్టి రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాడి దాదాపు 20 కోటలను నిర్మించి, 25 కోటలను పోరాడి స్వాధీనం పర్చుకొని అంతిమంగా మొగలు పాలకులను తరిమి కొట్టి గోల్కొండ కోటను స్వాధీనం చేసుకొన్న భారతదేశ మొట్టమొదటి దళిత బహుజన విప్లవ వీరుడు పాపన్నగౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సుంకరి శ్రీశైలం గౌడ్, పి.చంద్రశేఖర్‌గౌడ్, అమరవేణి వెంకట రమణగౌడ్, బండిపల్లి ప్రకాష్‌గౌడ్, బుర్ర రాజరాం గౌడ్ అమరవేణి శంకర్ గౌడ్, చెపూరి శ్రీనివాస్‌గౌడ్, కొత్తకొండ భూమగౌడ్, రాజేశ్వర్‌గౌడ్, కోటగిరి నర్సాగౌడ్, సిర్ర గణేష్‌గౌడ్, సిర్ర శ్రీనివాస్‌గౌడ్, జగన్ గౌడ్, బొంగోని నర్సాగౌడ్ బండిపల్లి రమణగౌడ్ పోతుగంటి రాములుగౌడ్, అమరవేణి శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు 100 మంది గౌడ కులస్తులు పాల్గొన్నారు.

కడెం : తెలంగాణ ప్రాంతాన్ని పట్టిపీడిస్తున్న మొగల్ పాలకుల అరాచకాలను ఎదిరించి, విరోచితంగా పోరాడి అమరుడైన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని మండల గౌడ సంఘం నాయకులు అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి కార్యక్రమాన్ని మండల గౌడ కులస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బహుజన రాజ్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నతమైన వ్యక్తి పాపన్న గౌడ్ అని కొనియాడారు. బహుజనులకు రాజ్యాధికారం దక్కాలని గొంతెత్తి నినదించడమే కాకుండా పిడికిలెత్తి పోరాడిన యోధుడు పాపన్న గౌడ్ అన్నారు. నిజాం పాలకులు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి బహుజనుల అభ్యున్నత కోసం కృషి చేశారని వారి బాటలో బహుజనలంతా నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు శేఖర్‌గౌడ్, రవిగౌడ్, రాజేశ్వర్‌గౌడ్, తిరుపతిగౌడ్, రామగౌడ్, దశగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రమేష్‌గౌడ్, పి. శేఖర్‌గౌడ్, సత్యగౌడ్, కే రమేష్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మల్లేష్ యాదవ్, కడెం మాజీ సర్పంచ్ చిన్నయ్య, గౌడ కులస్తులు పాల్గొన్నారు.





తక్షణమే రైతులందరికీ రుణమాఫీ చేయాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ఎలాంటి ఆంక్షలు లేకుండా, తక్షణమే రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు దుబ్బుల చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను శవయాత్ర నిర్వహించి, దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత కొందరి రైతులకు మాత్రమే రుణమాఫీ చేయడం సరైందికాదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని రెండు లక్షల వరకు రైతులందరికీ రుణమాఫీ చేసి ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న రైతన్నల మొహంలో చిరునవ్వులు నింపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతులు, యువకులు పాల్గొన్నారు.

దశల వారీగా సమస్యలు పరిష్కారం



నవతెలంగాణ-ఉట్నూర్

దశలవారిగా ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని లక్కారాం, వేణునగర్ కాలనీల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పొద్దు పొడుపు బొజ్జన్న అడుగు కార్యక్రమం చేపట్టి ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలను తెలుసుకున్నారు.

కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రెండు లక్షల రుణమాఫీ జరిగేంత వరకు కాంగ్రెస్ నాయకులను గ్రామగ్రామాన రైతులు నిలదీయాలని బీఆర్ఎస్ రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు రోకండ్ల రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులతో కలిసి మాట్లాడారు. ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఎనిమిది నెలల పాలనలో విడతల వారిగా రుణమాఫీ చేసి, రైతులను ముప్పతిప్పలు పెడుతున్నారని మండిపడ్డారు. సంపూర్ణ రుణమాఫీ జరిగేంత వరకు అన్నదాతలకు అండగా నిలుస్తామన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ల నేతృత్వంలో అన్నదాతలకు మద్దతుగా ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

బంద్ విజయవంతం



నవతెలంగాణ-ఉట్నూర్

బంగ్లాదేశ్‌లో మైనార్టీ ప్రజలు హిందువులపై జరుగుతున్న మరణ హోమానికి నిరసనగా ఆదివారం హస్నాపూర్ మార్కెట్‌ను విజయవంతంగా బంద్ నిర్వహించారు. బంద్ కార్యక్రమంలో శ్రీ స్వామి వివేకానంద యూత్, అన్నాభావు సాతే యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. ఆదివారం మండలంలోని ధర్మసాగర్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలైన గంజాయి సాగు చేయకూడదని హితవు పలికారు. గంజాయి సాగు చేసిన, అమ్మిన చట్ట రీత్యా నేరమన్నారు. ఎవరు కూడ గంజాయిని సాగుచేయకూడద న్నారు. ఎవరైనా ఇటువంటి దందాకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మత్తు పదార్థాలు అమ్మితే కఠిన కారాగార శిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. ముందుగానే ఆ నేరానికి పోకుండా జాగ్రత్త వహించాలని యువకులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
నలుగు తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | 19 ఆగస్టు, 2024 | www.navatelangana.com

వ్యాపారులకు కరువైన అవగాహన

● దుకాణంలో చెత్త రోడ్లపైకి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలో చెత్త నిర్వహణపై వ్యాపారులకు కనీస అవగాహన కరువైంది. ప్రతిరోజు దుకాణం మూసివేసే సమయంలో దుకాణంలోని చెత్తను మొత్తం కూడా రోడ్డుపై వేయడంతో రాత్రిపూట రోడ్లపై వెళ్లే పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ ఇదే సమయంలో వర్షం కురిస్తే ఎక్కడికి అక్కడ బురదమయంగా మారి దోమలు ప్రబలే అవకాశం ఉంది. ప్రతిరోజు మున్సిపాలిటీ సిబ్బందికి వ్యాపారుల తీరు తలనొప్పిగా తయారైంది. ప్రతి దుకాణం యజమాని ఒక సంచిలో లేదా ప్రత్యేక చెత్త బుట్ట ఏర్పాటు చేసుకుంటే ఇబ్బందులు తొలుగుతాయి. ఇతరులకు చెప్పే వ్యాపారులే ఇలా చేయడం పట్ల జిల్లా కేంద్రంలోని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులైన వీరికి అవగాహన కల్పించి ప్రతి దుకాణానికి ఒక చెత్తబుట్ట ఏర్పాటు చేసుకునేలా చూడాలని కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు అవసరం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో అవసరమని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహీయా (తారిక్) అన్నారు. ఆసిఫాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ చెట్లతో సాధ్యమవుతుందని అన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించడానికి చెట్లు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో జెడీసీ నాంపల్లి శంకర్, వీపీ పుల్లూరు శంకర్, లయన్ విశాల్ పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న మాలీ సంఘం నాయకులు



నవతెలంగాణ-కెరమెరి

పిడుగుపాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన చౌదరి రమేష్ కుటుంబాని కెరామెరి మండల మాలీ సంఘం నాయకులు ఆర్థిక సాయం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాలీ సంఘం మండల అధ్యక్షుడు కావుడే తులసీరాం, సంఘం నాయకులతో కలిసి వ్యవసాయ పనులు చేస్తూ పిడుగు పాటుకు గురై మరణించిన చౌదరి రమేష్ కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. మృతుడి భార్య సుమిత్రకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. ఐదేండ్ల లోపు ఉన్న ఇద్దరు చిన్నారులున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మానవత దృక్పథంతో పక్కా ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఇరుకుటుంబాలకు రూ.6వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ వాడై సోనే రావు, మాలీ సంఘం మండల ఉపాధ్యక్షుడు శ్యాంరావు, సండే నారాయణ, కొట్రంగే తిరుపతి పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడి

● ఒకరిపై కేసు నమోదు

నవతెలంగాణ-చింతలమానెపల్లి

మండలంలోని రాణవెల్లి గ్రామంలో గుడుంబా అమ్ముతున్నారన్న ముందస్తు సమాచారం మేరకు ఎస్సై ఇస్లావత్ నరేష్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఈక్రమంలో శాపిడే రత్నక్క ఇంట్లో తనిఖీ చేయగా వారి వద్ద ఐదు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా స్వాధీనం చేసుకొని రత్నక్కాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ జెడ్పీటీసీ రామ్‌నాయక్



నవతెలంగాణ-సిర్పూర్(టి)

కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు మాజీ జడ్పీటీసీ అజ్మీర రామ్ నాయక్ అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలో సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో జాగృతి మహిళా మండల అధ్యక్షురాలు అజ్మీర విజయ, మాజీ బీజేపీ వార్డ్ మెంబర్లు అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం సిర్పూర్ మండల కేంద్రంలో ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారం చేపట్టిన నుండి పేద ప్రజల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తుందని, కాంగ్రెస్ నాటి కాలంలో ఏ విధంగా అయితే పేద ప్రజల కోసం ఆలోచించిందో ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ఆ విధంగా పని చేయడం సంతోషకరమని దీనికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చౌదరి తిరుపతి, జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడు ఇప్ప రవి శంకర్, మార్కెట్ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి బోనాలు



నవతెలంగాణ-కౌటాల

శ్రావణమాసం సందర్భంగా కౌటాల మండలం శీర్ష గ్రామంలో ఒగ్గు పూజారులు మల్లికార్జున స్వామి వారికి బోనం కోసం జోగు పట్టారు. ప్రతి యేడాది శ్రావణమాసం రెండో ఆదివారం ఒగ్గు పూజారులు కలిసి ఇంటింటికెళ్లి జోగు పట్టి ఆ బియ్యంతో మల్లికార్జున స్వామికి బోనం పోయడం మరుసటి రోజు సోమవారం ఇవే బియ్యంతో శివపార్వతులకు పప్పన్నం అండి సమర్పిస్తారు. ఇందులో ఒగ్గు బీర్ల కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు పోలే శ్రీశైలం, మండల అధ్యక్షుడు ఈరు బీరయ్య, ప్రధాన కార్యదర్శి అడే సింగరి, కళాకారులు పోలే కొమురయ్య, పోలే రాజయ్య పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం

● ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు ఉపేందర్

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో జరిగిన ప్రమాదానికి అధికారుల, యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ ఆరోపించారు. ఆదివారం గాయమైన కార్మికుడు మల్లేష్ ఇంటికి కార్మిక సంఘం నాయకులు సాగర్ గౌడ్, రాజశేఖర్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్మనెంట్ ఉద్యోగులు చేయల్సిన పనిని, కాంట్రాక్టు ఉద్యోగులతో చేయించడం తప్పని, సీహెచ్‌పీలో బంకర్ వద్ద బెల్ట్ క్లీనింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ, కార్మికుల సంక్షేమంపై లేదని, రక్షణ మొత్తానికి గాలికి వదిలేశారన్నారు. ఈ ప్రమాదానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కాంట్రాక్టు కార్మికునికి మెరుగైన వైద్యం అందించాలని, ఆన్ డ్యూటీలోకి తీసుకొని కార్మికునికి రోజు మాస్టర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఫలించిన ప్రయోగం..!

● కలుపు తీసే యంత్రాన్ని తయారు చేసిన అయ్యూబ్ ● ప్రోత్సహమందిస్తే మరిన్ని పరికరాల తయారీకి ఆస్కారం

పంట పొలంలో పెరిగిన గడ్డిని తొలగించడం(కలుపుతీయడం) అన్నదాతలకు ఆర్థిక భారంగా మారుతోంది. కూలీలకు ఒక్కొక్కరికి రోజుకు రూ.300 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇలా పంట కాలం పూర్తయ్యే వరకు కలుపు తీసేందుకే రైతులు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. అన్నదాతలకు కలుపు తీసే యంత్రం అందుబాటులోకి తీసుకొస్తే బాగుంటుందనే ఆలోచన చేశారు ఈ యువకుడు. అనుకున్నదే తడువుగా ఆలోచనలకు పదును పెట్టాడు. పంట పొలాల్లో గడ్డిని తొలగించే సరికొత్త యంత్రాన్ని తయారుచేశారు షేక్ ఆయ్యూబ్. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కేంద్రంలోని సుల్తాన్‌గూడ గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించాడు. షేక్ ఇసాక్, అక్తర్‌బీ దంపతుల మూడో కుమారుడు. తండ్రి వ్యవసాయ పనులు చేస్తుండగా, ఇద్దరు అన్నయ్యలు, మరో తమ్ముడు బైక్ మెకానిక్ షాప్ నడుపుతున్నారు.

నవతెలంగాణ-కెరమెరి

పంట పొలాల్లో పెరిగిన గడ్డిని తొలగించే సరికొత్త యంత్రాన్ని తయారు చేసి ఆదర్శంగా నిలిచాడు షేక్ అయ్యూబ్. కుమురం భీం- ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కేంద్రంలోని సుల్తాన్‌గూడ గ్రామంలో రైతు కుటుంబంలో షేక్ ఇసాక్, అక్తర్‌బీ దంపతుల మూడో కుమారుడు అయ్యూబ్. తండ్రి వ్యవసాయ పనులు చేస్తుండగా, ఇద్దరు అన్నయ్యలు, మరో తమ్ముడు బైక్ మెకానిక్ షాప్ నడుపుతున్నారు. అయ్యూబ్ బైక్ మెకానిక్ పనులకు వెళ్తానే, అప్పుడప్పుడు చేను పనులకు వెళ్లేవాడు. వారిది కష్టపడితే గాని పూటగడవని పరిస్థితి. ఎడ్లు కొనే స్థోమత లేదు. 3 ఎకరాల భూమికి ప్రతి సారి కూలీ చెల్లించాలంటే నానా కష్టాలు పడాల్సి వచ్చేది. ఎడ్ల జతతో వచ్చి కలుపు తియ్యాలి. దీనికి ఎడ్ల కిరాయితో పాటు రైతుకు ఒకరోజు కూలీ 15వందలు ఇవ్వాల్సి వస్తుంది. దీంతో ఆ యువకుడు వినూత్న ప్రయత్నం చేశాడు. ఆయనకు వచ్చిన ఆలోచనతో కలుపు తీసే యంత్రం తయారు చేశాడు. ఏడాదిగా తన పంట చెనులో అదే యంత్రంతో కలుపు తీస్తూ కూలీలకు అయ్యే ఖర్చును తగ్గించుకున్నాడు. చేనులో పెట్రోల్‌తో కలుపు తీసే యంత్రాన్ని ప్రయోగాత్మకంగా ఉపయోగించాడు. ఇంకేముంది తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేయొచ్చని గుర్తించాడు. అతి తక్కువ ఖర్చుతో చేనులో పేరుకుపోయిన కలుపుని సులభంగా తొలగిస్తున్న యువకుడి మేధస్సు గ్రహించిన మండల రైతులను ఆలోచింపజేసింది. ప్రస్తుతం ఈ యంత్రంతోనే పత్తి చెనులో పెరిగిన కలుపు మొక్కలు తొలగిస్తూ పంట దిగుబడి ఖర్చులు తగ్గించుకుంటున్నారు.



అయ్యూబ్ తయారు చేసిన కలుపు తీసే యంత్రం

ప్రభుత్వం సహకారం అందించాలి

కలుపు యాంత్రాన్ని తయారు చేసిన ఆయుబ్, వ్యయ సాయ పనులకు అధిక ఖర్చులయ్యే పరిస్థితుల్లో మరో రెండు యంత్రాలు సైతం తయారు చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. పత్తితో పాటు ఇతర పంటలకు పిచికారీ, ఎరువులు వేయడానికి సిద్ధంగా ఉన్నాడు. ఖర్చుతో కూడుకున్నవి కావడం ఆర్థిక సమస్యల కారణంగా ఆ యంత్రాల తయారీ మొదలు పెట్టలేదు. ప్రభుత్వం, స్వచ్ఛంద స్వంస్థలు, దాతలు ముందుకొచ్చి సాయసహకారాలు అందిస్తే అతి కొద్ది రోజుల్లోనే పిచికారీ, ఎరువుల వేసే యంత్రాల తయారీ పూర్తి చేయుటకు సిద్ధంగా ఉన్నానని ఆయన తెలిపారు.

పాత వాహనాల సమూల్లతో..

పాత ఇనుప దుకాణంలో వృథాగా పడేసిన ద్విచక్ర వాహనం ఇంజన్ కొనుగోలు చేసి, దానికి ట్రాలీ ఆటో రెండు చక్రాలను బిగించారు. పట్టుకోవాడానికి వీలుగా రెండు పొడవాటి ఇనుప కడ్డీలను ఏర్పాటు చేసి, ఎక్సలేటర్, బ్రేకులను తయారు అమర్చారు. కింది భాగంలో కలుపుతీసే పదునైన రాడ్‌తో పాటు మట్టి తీసేందుకు మరో కడ్డీ రాడ్‌ను బిగించారు. ఈ యంత్రం తయారు చెయడానికి రెండు నెలల సమయం పట్టిందని, రూ.30 వేల రూపాయలు ఖర్చు అయినట్లు ఆయుబ్ తెలిపారు.



పొలంలో కలుపు తీస్తున్న అయ్యూబ్

మరిన్నీ యంత్రాలు తయారు చేస్తా



అయ్యూబ్, సుల్తాన్‌గూడ, కెరమెరి

ప్రతి ఏడాది పత్తి చెనులో కలుపు మొక్కలు తొలగించేందుకు ఎక్కువ డబ్బులు వేచించాల్సి వచ్చేది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండడంతో కూలీలకు డబ్బులు చెల్లించడం కోసం నాన్న అప్పులు చేయాల్సి వచ్చేది. పంట చేతి కొచ్చే వరకు మూడు నుండి నాలుగు దఫాలుగా కలుపు తేయాల్సి వచ్చేది. దీంతో ఖర్చులు పెరిగి ఇబ్బందులు పడేవాళ్ళం. ఇప్పుడు ఆ సమస్య తీరింది. అధికారులు, దాతలు ప్రోత్సాహంఅందిస్తే పిచికారీ, పంటలకు ఎరువులు వేసే యాంత్రాన్ని సైతం తయారు చేస్తాను.



పొలంలో కలుపు తీసే యంత్రాన్ని పరిశీలిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ కలాం(ఫైల్)



షాపులో మెకానిక్ పని చేస్తున్న అయ్యూబ్



కలుపు తీసే యంత్రానికి రిపేర్ చేస్తున్న ఆయ్యూబ్

మహనీయుల త్యాగాలు చిరస్మరణీయం

● కలెక్టర్ వెంకటేష్ ధోత్రే
● ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహనీయుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. కలక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సజీవన్ అధ్యక్షతన ఆ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలకు అదనపు కలెక్టర్ దీపక్ తివారి, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొగల్ బహదూర్లు చేస్తున్న అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడి గోల్కొండ కోటను గడగడలాడించిన వీరుడు తొలిదశ విప్లవ కారుడు సర్దార్ పాపన్న అని అన్నారు. పోరాడితే సాదించనిది ఏమి ఉండదని, గోల్కొండ రాజ్యానికి రాజు అయి నిరూపించాడన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో బీసీలు ముందుకు సాగాలన్నారు. అంతకు ముందు గౌడ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో తమ సంఘ భవన నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు. రాజ్యాధికార సాధన కోసం బీసీలు అంత ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గౌడ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, గౌడ సంఘం నాయకులు సుదర్శన్ గౌడ్, అనీల్ గౌడ్, జగ్గాగౌడ్, కర్ణాగౌడ్, రామగౌడ్, ఆంజనేయులు గౌడ్, మనోహర్ గౌడ్, శంకర్ గౌడ్, ప్రకాష్ గౌడ్, మురళి గౌడ్ పాల్గొన్నారు.

కౌటాల : సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను తాళ్ళపెల్లి సత్యనారాయణ గౌడ్ కొనియాడారు. అనంతరం చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ కులస్తులు పాల్గొన్నారు.

రెబ్బెన : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 374వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలామలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సర్దార్ పాపన్న గౌడ్ చేసిన పోరాటలు, ప్రజలు,రైతులను చౌతన్య పరిచిన తీరును వివరిస్తు కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అంజనేయులు గౌడ్, మోడం సుదర్శన్ గౌడ్, వట్టి శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ శంకర్ గౌడ్, కొండ్రా జగ్గా గౌడ్, నిమ్మల మహెష్ గౌడ్, శేఖర్ గౌడ్, చిరంజీవి గౌడ్, కిష్టగౌడ్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : సర్దార్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



కౌటాల



రెబ్బెన

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-రెబ్బెన

యోగ వల్ల అనేక లాభాలున్నాయని తహసీల్దార్ రామ్మోహన్‌రావ్ అన్నారు. గోలేటిలోని సీఈఆర్ క్లబ్ నిర్వహించిన యోగ పోటీలకు ఆయన ముఖ్య అధితిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగ మనిషి శరీరం నుండి మెదడు వరకు అన్ని అవయవాలకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి యోగా పోటీలకు వివిధ కేటగిరిలలో విద్యార్థులు ఎంపికైనట్టు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేసరి ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి కొలిపాక కిరణ్, జాయింట్ సెక్రటరీ కేసరి అలేఖ్య తెలిపారు. ఇందులో సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొనగ 30 మందిని ఎంపిక చేశారు. వీరంతా అక్టోబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకరమ్మ, స్టేట్ అబ్జార్వర్ మండ శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, ఎంఆర్ఐ ప్రేమ్ కుమార్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎస్.లక్ష్మీ, నవీన్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



పెరిగిన వరద..ఎత్తిన గేట్లు

● అడ, వట్టివాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఏజెన్సీ మండలాల్లో శుక్ర, శనివారాలు భారీ వర్షాలు నమోదు కావడంతో మండలంలోని రెండు ప్రాజెక్టులకు వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు కుమురం భీమ్, వట్టివాగు ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. కుమురం భీం ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 243 మీటర్ల గాను 237 మీటర్ల చేరుకుంది. ప్రాజెక్టులోకి 813 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో 5వ గేటు 0.20మీటర్లు పైకెత్తి 431 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. అలాగే వట్టివాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 239.5 మీటర్ల గాను 238.5 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టులోకి 840 క్యూసెక్కుల వరద నీరు వచ్చే చేరుతుండడంతో 3,4 నెంబర్ గేట్లను 0.50 మీటర్లు ఎత్తి శనివారం అర్ధరాత్రి 1800 క్యూసెక్కుల నీటిని వదిలిన అధికారులు ఆదివారం సాయంత్రం వరకు గేట్లను కొంచెం దించి 0.20మీటర్లు ఎత్తుతో 720 క్యూసెక్కుల బయటకు వదులుతున్నారు. దీంతో కుమురం భీం ప్రాజెక్ట్, వట్టివాగు ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంజనీరింగ్ అధికారులు సూచిస్తున్నారు.

కుక్కకాటు మందు ఆస్పత్రిలో ఉంచాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కుక్క కాటు మందు జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో లేకపోవడం దారుణమని వెంటనే మందు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని ఆస్పత్రులను అధికారులు, ప్రజా ప్రతినిధులు తనిఖీ చేయడం వట్టిదేనని ఎద్దేవా చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి కనీసం మందులు అందుబాటులో ఉంచని అధికారులు పనిచేయడం ఎందుకని ప్రశ్నించారు. అధికారుల మొద్దు నిద్ర విడకుంటే ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని చిన్న అయినం గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మహిళ పురుగులమందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ రమేష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జంగిటి చంద్రక్క(50) కొన్ని రోజులుగా మతిస్థిమితం కోల్పోయింది. దీంతో శనివారం ఇంటి వద్ద గల పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. కుమారుడు మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు సన్మానం

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాలకు చెందిన ఉమా అడ్స్ నిర్వాహకుడు ఫొటోగ్రాఫర్ జక్కుల రాజును ఆర్డీఓ వి.రాములు ఆదివారం తన కార్యాలయంలో సత్కరించారు. ఎన్నికల నిర్వహణ ఫొటో, వీడియో రూపకంలో చిత్రీకరించినందుకు, జిల్లాలోని చారిత్రక కట్టడాలు ఫొటోలు తీసి జిల్లా డాక్యుమెంటరీ తీసినందుకు రాజును సన్మానించారు. గతంలోను జిల్లాకు సంబంధించిన డాక్యుమెంటరీ చిత్రీకరణలో ప్రతిభ కనబర్చారు. ఫొటోగ్రాఫీలో అత్యుత్తమ స్థానానికి చేరాలని ఆర్డీఓ ఆకాక్షించారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలి

నవతెలంగాణ-జన్నారం



ఖానాపూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జును బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పూర్ణచందర్ నాయక్ కోరారు. ఆదివారం జన్నారం వచ్చిన ఎమ్మెల్యేను ఆయన శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేల చూడాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, పూర్ణచందర్ రావు, బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు, కె.లక్ష్మణ్, మిక్కిలినేని రాజశేఖర్ పాల్గొన్నారు.

సర్ధార్ పాపన్నగౌడ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

• ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-నస్పూర్

అలుపెరుగని పోరాట యోధుడు సర్దార్ పాపన్న గౌడ్ అని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో పాపన్న గౌడ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. దీనికి కలెక్టర్, అధికారులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా సర్దార్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వాయి పాపన్న జీవితం అందరికీ ఆదర్శమన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేసిన యోదుడని కొనియాడారు. రైతుల కోసం భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

జన్నారం : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం నేటికి స్ఫూర్తినిస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సబ్బండ వర్గాలకు రాజ్యాధికారం కావాలని పోరాడిన యోధుడు బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. కుమురం భీం, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విరిద్దరూ చేసిన పోరాటం స్ఫూర్తి దాయకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలలో గౌడులకు ఇచ్చిన హామీలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. నేటి యువత పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితోముందుకెళ్ళాలన్నారు. రాజకీయ, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. నియోజకవర్గంలోని గౌడన్నల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ ముజఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం మిక్కిలినేని రాజశేఖర్ మాజీ ఎంపీపీ మాదాడి సరోజన, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, పొనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, గౌడ సంఘం నాయకులు మూలభాస్కర్ గౌడ్, పొడేటి సతీష్ గౌడ్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, వోల్లాల నర్సాగౌడ్, కాసరపు పోచాగౌడ్, పరకాల తిరుపతి గౌడ్, రవి గౌడ్ పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలి..

సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధన కృషి చేయాలని, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ డైరెక్టర్ పూర్ణచందర్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, శ్రీనివాస్ గౌడ్ భాస్కర్ గౌడ్, వల్లాల నర్సాగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు పూర్ణచంద్రావు, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ మాదాడి సరోజన, వైస్ ఎంపీపీ వినయ్ కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు, కో ఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్ భరత్ కుమార్ పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని కొండాపూర్ చౌరస్తాలో మండల గౌడ సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ 374వ జన్మదినోత్సవ కార్యక్రమం ఆదివారం మోకు దెబ్బ మండల అధ్యక్షుడు మార్క శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సర్వాయి పాపన్న చిత్రపటానికి ప్రజాసంఘాల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల సలహాదారు పల్లె మల్లయ్య, సామాజిక చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాబు, సలహాదారు మద్దినేని చిన్న భీమయ్య, ఆదివాసీసేన మండల అధ్యక్షుడు మడవి వెంకటేష్, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య, మండల కాంగ్రెస్ నాయకుడు రాజమౌళి, మోకు దెబ్బ మండల అధ్యక్షుడు మార్క శ్రీనివాస్ గౌడ్, మండల ఐకాసా కన్వీనర్ సిలోజ్ మురళి, మండల గౌడ సంఘం సలహాదారులు నేరెల్లి బుగ్గయ్యగౌడ్, కోడూరు గురువయ్య గౌడ్, కోడూరు విద్యా సాగర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పోడేటి రాజా గౌడ్, సంయుక్త కార్యదర్శి తాటిపాముల రాజబాబు గౌడ్, మండల యూత్ కమిటీ అధ్యక్షులు కోయాడ అంజన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రావణ్ గౌడ్ పాల్గొన్నారు.

దండేపల్లి : విదేశి శక్తుల నుండి దేశాన్ని కాపాడేందుకు దోపిడి వ్యవస్థకు తిరుగుబాటు చేసిన సర్ధార్ సర్వాయి పాపన్న 374వ జయంతి వేడుకలను ఆదివారం దండేపల్లి గౌడ కుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలా వేసి నివాళులర్పించారు. అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గౌడ కుల సంఘ నాయకులు బండి రవి గౌడ్, సంఘ నాయకులు, వివిధ గ్రామాల గౌడ కులస్తులు పాల్గొన్నారు.



నస్పూర్ : సర్దార్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జన్నారం



కాసిపేట



దండేపల్లి



గిరిజనుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

• రాష్ట్ర గిరిజన సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి



నవతెలంగాణ-జన్నారం

గిరిజనుల అభివృద్ధియే ధ్యేయంగా పనిచేస్తానని తెలంగాణ రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. ఆదివారం తన పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి ప్రొఫెసర్ జయశంకర్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ జడ్పీ పాఠశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు రక్తదానం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహం నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మారుమూల గిరిజన పల్లెలను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌పీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోహెల్ షా, జిల్లా ఉపాధ్యక్షులు అజ్మత్ ఖాన్, ఆదివాసీ సంఘ నాయకులు సాదం చిన్నయ్య, పద్మ, వెంగయ్య, భూమేష్, నరసయ్య, పిట్టల రాజం, కాంగ్రెస్ నాయకులున్నారు.

మృతుడి కుంటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని ముల్కలపేట గ్రామానికి చెందిన ఏలేశ్వరం లచ్చన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నిరు పేద కుటుంబం కావడంతో దశ దిన కర్మ కార్యక్రమానికి గ్రామ యువ నాయకులు కామెర మల్లేష్ కుటుంబ సభ్యులకు బియ్యం బస్తా, రూ.వెయ్యి నగదు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సతిపతి, కవికుమార్, జంబోజీ మహేందర్, ఎంచ సంపత్, రమేష్, ఆనంద్, మనోజ్, పవన్, యువకులు పాల్గొన్నారు.

టైగర్ జోన్‌ను రద్దు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను ఆదివారం జన్నారానికి వచ్చిన సందర్భంగా కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ప్రభంజనం మాట్లాడుతూ టైగర్ జోన్‌ని రద్దు చేయాలన్నారు. టైగర్ జోన్ పరిధిలో ఉన్న ఆదివాసులకు, మహేంద్రులకు ప్రత్యేక రక్షణ కల్పించాలని కోరారు. పోడు భూములకు పట్టాలివ్వాలని, వెదురు కోసం అడవికి వెళ్లే వారిపై ఫారెస్ట్ అధికారులు దాడులు చేస్తున్నారని అలా జరగకుండా చూడాలన్నారు. చెక్ పోస్ట్‌ల వద్ద వెదురుతో తయారు చేసే ఉత్పత్తులకు చలాన్లు వేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. మహేంద్ర(మెదరి) కులస్తులను ఎస్టీలలో కలపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ మండల నాయకులు అరుణ్ మహేంద్ర, ఏకుల వర్షన్, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

పర్యవేక్షణాధికారుల పోస్టులు భర్తీ చేయాలి

• ఎస్సీ, ఎస్టీ, టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న

నవతెలంగాణ-జన్నారం

రాష్ట్రంలో రెండు దశాబ్దాలుగా పర్యవేక్షణాధికారుల పోస్టులు భర్తీకాక తీవ్రమైన సంక్షోభం నెలకొందని, ప్రభుత్వం చొరవతీసుకుని వెంటనే ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులు, డైట్, బీఈడీ కళాశాల అధ్యాపకుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో పత్రికా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 ప్రకారం ఉపాధ్యాయులందరూ విద్యాశాఖలోని ఉన్నత స్థాయి పర్యవేక్షణ అధికారులుగా పదోన్నతులకు అర్హులని అన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనీ, బకాయి పడ్డ కరువు భత్యం వెంటనే విడుదల చేయాలన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ వెంటనే అమలు చేయాలని, బదిలీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. పదోన్నతులలో సీనియారిటీ, పోస్టింగ్, రోస్టర్ పాయింట్‌లో నష్టం జరిగిన ఉపాధ్యాయుల అప్పీలను పరిష్కరించాలన్నారు. ప్రతి మండలంలో నర్సరీ నుండి పదవ తరగతి ఉండేలా అన్ని వసతులతో కూడిన ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు తుంగూరు గోపాల్, కామెర శంకర్, తుంగూరి వెంకట్, రాజం పాల్గొన్నారు.



షిప్ అండ్ గోట్ ఫామ్ ప్రారంభం



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో ఆదివారం మణికంఠ షిప్ అండ్ గొట్ ఫామ్‌ను స్టేట్ బ్యాంక్ మేనేజర్ మహేష్ ప్రారంభించారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద జన్నారం మండలం ధర్మారం గ్రామ సమీపంలో ఫామ్ హౌస్‌ను స్టేట్ బ్యాంకు సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ పథకం కింద గొర్రెలు మేకలను సహజ సిద్ధంగా పెంచి ఉపాధి పొందడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పూర్ణ నాయక్, ప్రముఖ కాంట్రాక్టర్ పూర్ణచందర్‌రావు, కో ఆప్షన్ సభ్యులు మునువర్ అలీ ఖాన్, మాజీ సర్పంచ్ భూమేష్, నిర్వాహకులు గొల్లపెల్లి రమేష్, సుభాష్, కాసెట్టి లక్ష్మణ్ పాల్గొన్నారు.

సంతోషాల్లోనే కాదు..దు:ఖంలో కూడా



నవతెలంగాణ-జన్నారం

దోస్తులంటే సంతోషాల్లోనే కాదు దు:ఖంలో కూడా అండగా ఉంటామని నిరూపించారు తిమ్మాపూర్ గ్రామ చిన్నారులు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గుండ సురేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుమారుడు గుండ అరవింద్ స్నేహితులు కుటుంబానికి అండగా నిలవాలనే దృఢసంకల్పంతో చిన్నారులంతా ఒక్కటై చెయి చేయి కలిపి స్నేహితులంత ఒక్కటై స్నేహితుడి కుటుంబానికి 25 కిలోల రైస్ బ్యాగ్‌ను అందించి వారి పెద్ద మనసును చాటుకున్నారు. పెరుగ అకీరనందన్, దర్శనాల మనోజ్ కుమార్, పెరుగు సహస్ర, బెంబడి రాజేశ్వరి, కూకటికారు దిలీప్, కుకటికారి అంజి బాధిత స్నేహితుడికి అందించారు. చిన్నపిల్లలైనా పెద్దమనసుని గ్రామస్తులు ప్రశంసించారు.

పురుగులమందు తాగి యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-బోథ్

పురుగులమందు తాగి యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నిగిని గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నిగిని గ్రామానికి చెందిన మట్ట సరస్వతి(17) డబ్బుల విషయంలో మందలించడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పురుగులమందు తాగింది. ఆమెను ప్రభుత్వాస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్టు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పేదల సంక్షేమానికి పెద్ద పీట

• ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-జన్నారం

రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని రెండ్లగూడ(తంగెళ్ళపల్లి) గ్రామంలో అంగన్‌వాడీ ప్రాంగణంలో రూ.లక్షల 95 వేల వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ గోడ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ముందుగా గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతుల కల్పించడానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, సీనియర్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, పీఏసీఎస్ చైర్మెన్ అల్లం రవి, ఎంపీటీసీ దాముఖ మమతా కరుణాకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం సతీష్, లక్ష్మీనారాయణ, ముత్యం రాజన్న, అల్లం వెంకటరాజం, కంప సుధీర్, ముజ్జు, కార్యదర్శి శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ శైలజ పాల్గొన్నారు.

ఉత్తమ కార్యదర్శిని సన్మానించిన ఎమ్మెల్యే

మండలంలోని రేండ్లగూడ గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే బొజ్జు సన్మానించారు. శ్రీనివాస్ ఇటీవల కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ కార్యదర్శి అవార్డును అందుకున్నారు. ఆదివారం కార్యదర్శి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే బొజ్జు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్ జిల్లా స్థాయిలో ఉత్తమ కార్యదర్శిగా అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పోడు భూముల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలో పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని మాజీ జడ్పీటీసీ ఆర్.సంతోష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ కోరారు. ఆదివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు ఎమ్మెల్యే వినోద్, మంచిర్యాల కలెక్టర్ దీపక్ కుమార్‌ను కలిసి సమస్యను వివరించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఉన్న భూమిని రెవెన్యూ, అటవీశాఖ కలిసి ఉమ్మడి సర్వే చేసి గిరిజనులకు సంబంధించిన భూమిని వారికి దక్కేలా పట్టాలివ్వాలని కలెక్టర్ వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై కలెక్టర్ సత్వరమే స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే గతంలో గిరిజనులకు జారీ చేసిన భూమి హక్కు పత్రాలకు బ్యాంకర్‌లు లోన్లు ఇవ్వడం లేదని తెలియజేయడంతో కలెక్టర్ ఇట్టి విషయంపై అధికారులకు ఆదేశించి సత్వరమే సమస్యను పరిష్కరించి లోన్లు ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గొర్లపల్లి, గెర్రెగూడెం, కాటపెల్లి, చామనపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నవతెలంగాణ-నస్పూర్



క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం కృష్ణ కాలనీలోని శాంతి మైదానంలో ఆర్కే5 గనిలో పనిచేస్తున్న ఉద్యోగుల మధ్య స్నేహ పూర్వక క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉద్యోగులు రోజువారి విధులు నిర్వర్తిస్తూనే తీరిక సమయాలలో క్రీడలలో పాల్గొనడం చాలా సంతోషకరమైన విషయమని, ఉద్యోగులు గెలుపు ఓటములను పక్కనపెట్టి క్రీడల్లో పాల్గొనడం చాలా అభినందనీయమన్నారు. సింగరేణి యాజమాన్యం కూడా క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్, డాక్టర్ లోకనాథ్ రెడ్డి, వర్క్ మెన్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-బోథ్



మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, మండల కేంద్రానికి చెందిన అల్లకొండ పోతన్న తండ్రి భోజన్న, అలాగే రైటర్ లక్ష్మణ్, అలాగే ఎడ్మల రమణ తల్లి ముద్దం గంగు బాయి, రెగట్ల వెంకటి, చబంట్ల బ్రహ్మం, అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఎంపీ గొడం నగేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బోథ్, సొనాల, బజార్‌హత్నూర్ మండల నాయకులు పాల్గొన్నారు.

21న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-తలమడుగు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 21న భారత్‌బంద్‌లో మాల కులస్తులతో పాటు ఉప కులాలు భారత్ బంద్‌లో పాల్గొని, విజయవంతం చేయాలని మాల సంక్షేమ సంఘం నాయకులు క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని లచ్చంపూర్, దేవాపూర్, భరంపూర్, అర్లి(కె) గ్రామాలలో పర్యటించి మాల సంఘం నాయకులతో మాట్లాడారు. భారత్ బంద్‌లో మాలలతో పాటు ఉప కులాలు భారత్ బంద్‌లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట మాల సంక్షేమ సంఘం నాయకులు గజానన్, అశోక్, సత్యనారాయణ, దత్తు, రాజేశ్వర్ ఉన్నారు.



పాపన్నగౌడ్ చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుంది : రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భూస్వాముల నుంచి రైతులను కాపాడటం కోసం సర్దార్ పాపన్నగౌడ్ చేసిన పోరాటం చరిత్రలో నిలిచిందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదివారం సర్దార్ పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో స్థానిక బస్ స్టాండ్ ఎదుట పాపన్నగౌడ్ విగ్రహం వద్ద అధికారికంగా జయంతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషాతో పాటు మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాపన్న గౌడ్ విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ రైతుల హక్కుల కోసం నిజాం సర్కార్‌కు, భూస్వాములకు వ్యతిరేకంగా సర్దార్ పాపన్న గౌడ్ పోరాటం చేశారని అన్నారు. ఆ మహనీయుడి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. అధికారులు సైతం ప్రజల కష్టాలను పరిష్కరిస్తూ, ఉత్తమ సేవలందించాలని సూచించారు. అదేవిధంగా మున్సిపల్ చైర్మెన్ జోగుప్రేమేందర్ మాట్లాడుతూ సర్దార్ పాపన్నగౌడ్ పెత్తందారులకు వ్యతిరేకంగా రైతులు, బహుజనుల హక్కుల కోసం పోరాడారని అన్నారు. ఆ మహనీయుడిని ఆదర్శంగా తీసుకుంటూ బహుజనులు హక్కుల సాధనకు పోరాటం చేయాలనీ పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు నలభై రెండు శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రిజర్వేషన్లను సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. గౌడ కులస్తులు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదేకరాల్లో ఈత చెట్లను పెంచిన విషయాన్నీ గుర్తు చేశారు. ఇదిలా ఉంటె సర్దార్ పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని రిమ్స్‌లో గౌడ సంఘం నాయకులు రోగులకు పండ్లను పంపిణి చేశారు. మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ కార్యక్రమ ముఖ్యఅతిథిగా హాజరై ఆయా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను అందచేశారు. రోగుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకుంటూ వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీసీడీడబ్ల్యూఓ రాజలింగు, అదనపు ఎస్పీ సురేందర్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షా, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, గౌడ సంఘం నాయకులూ పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో...

బహుజన సింహం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కలల రాజ్యాన్ని సాధిద్దామని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన కులాలను ఏకం చేసి సర్వాయి పాపన్న గౌడ్ ఆ కాలంలోనే బహుజన రాజ్యాన్ని సాధించారని, రజాకర్ల అగ్రవర్ణ రాజ్యాల దోపిడీ నినదిస్తూ ఉద్యమించిన మహా నాయకుడని పేర్కొన్నారు. తెలంగాణలో గోల్కొండ ఖిల్లాపై బహుజన జెండాను ఎగురవేసిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు చీటీ వెంకటేష్, బోథ్ మండల బాధ్యుడు కొండమడుగు గణేష్, ఇచ్చోడ మండల బాధ్యుడు శేఖర్, రమేష్, తలమడుగు మండల రాంచందర్, సర్కిల్ నరేష్, జైనథ్ మండల బాధ్యులు ఒమన్న, తలమడుగు మండల బాధ్యులు నవీన్ కుమార్, సిరికొండ మండల బాధ్యుడు రాజు, కీపర్ గంగన్న, వినుకుమార్ ఉన్నారు.



ఆదిలాబాద్‌టౌన్ : మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ రూరల్ : ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా అంకోలి గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయాల కోసం కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమాల్లో అంకోలి బీసీ సంఘం నాయకుడు ఎర్రం అశోక్, బండారు రమణ, అంకోలి గౌడ సంఘం నాయకులు అంగల్వార్ గంగాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బాల్ కిషన్‌గౌడ్, రమణగౌడ్, వేణుగోపాల్‌గౌడ్, రవి గౌడ్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్ : డీఎస్పీ ఆధ్వర్యంలో...



ఆదిలాబాద్ రూరల్ : అంకోలి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు నివాళులర్పిస్తున్న యువకులు

శ్యాంరావు మృతి కేసులో పురోగతి

- దెబ్బలతోనే మృతి చెందినట్లు ఆధారాలు లభ్యం?

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం బురదగూడ గ్రామానికి చెందిన కొట్రంగి శ్యాంరావు అలియాస్ సాంబయ్య ఈ నెల మూడో తేదీన మృతి చెందిన కేసులో పురోగతి ఉన్నట్లు తెలిసింది. శ్యాంరావు మంచం మీది నుండి పడి మృతి చెందినట్లు మొదట పోలీసులు కేసు నమోదు చేసినా, తర్వాత కుటుంబసభ్యులతో జరిగిన కొట్లాటలో తగిలిన దెబ్బలతోనే మృతి చెందాడని ఎస్పీకి సమాచారం అందిన విషయం తెల్సిందే. ఎస్పీ ఆదేశాల మేరకు పది రోజుల తర్వాత శ్యాంరావు మృతదేహాన్ని మట్టిలో నుండి వెలికితీసి రీ పోస్టుమార్టం నిర్వహించారు. ఈ రీ పోస్టుమార్టంలో శ్యాంరావు శరీరంపై తీవ్ర గాయాలున్నట్లు వెల్లడైనట్లు తెలిసింది. శ్యాంరావు ఛాతీపై, వెన్ను భాగంలో, రెండు కాళ్ల మడమలపై తీవ్ర గాయాలున్నట్లు ఆధారాలు లభ్యమైనట్లు సమాచారం. కాని ఫోరెన్సిక్ నివేదిక వచ్చే వరకు పోలీసులు ఈ కేసులో ముందుకు వెళ్లడం లేదు. ముఖ్యంగా శ్యాంరావు మృతి చెందిన సమయంలో సంఘటనాస్థలానికి వెళ్లిన అప్పటి రూరల్ ఎస్ఐ సోనియా తన పంచనామా రిపోర్టులో శ్యాంరావు శరీరంపై ఎలాంటి గాయాలు లేవని పేర్కొన్నట్లు తెలిసింది. దీనిపై కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతదేహంపై గాయాలున్నా ఆమె పంచనామాలో ఎందుకు ఆ విధంగా పేర్కొందనే విషయం పోలీసు శాఖలో చర్చనీయాంశమైంది. ఎస్ఐతో పాటు మరికొంతమంది సిబ్బందిపై కూడా అనుమానాలు కలుగుతున్నాయి. శ్యాంరావు మృతి చెందిన తర్వాత ఎస్ఐ సోనియా, పోలీసు సిబ్బంది కాల్‌డేటా కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మృతుని బంధువులు, గ్రామస్థులతో వీరు ఎక్కువ సార్లు మాట్లాడినట్లుగా ఆధారాలు కూడా లభ్యమైనట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాతే ఈ కేసు మిస్టరీ వీడనుంది.



ఐక్యంగా కదిలినప్పుడే సమన్యాయం సాధ్యం

- ఎన్‌పీజేఎఫ్ చైర్మన్ వీజీఆర్ నారగోని

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఐక్యంగా కదిలినప్పుడే సమన్యాయం సాధ్యమవుతుందని నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో ఎన్‌పీజేఎఫ్ జిల్లా కన్వీనర్ రూప్నర్ రమేష్ అధ్యక్షతన అన్ని కులాల ప్రతినిధులతో నిర్వహించిన సమన్యాయంపై చర్చ కార్యక్రమానికి కన్వీనర్లు నర్సయ్య, కొంకటి లక్ష్మణ్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఐక్యంగా ఉండాలన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీలన్నీ కూడా బూర్జువ పార్టీలని ఆరోపించారు. ఉన్నత వర్గాలకు ప్రాతినిధ్యం వహించే పార్టీల చేతుల్లో రాజ్యాధికారం ఉన్నంతకాలం ప్రజల పరిస్థితి అధ్వానంగా ఉంటుందన్నారు. రాజ్యాధికారి కోసం అన్ని వర్గాలు ఏకం కావాలన్నారు. రాజకీయ పార్టీల వద్దకు సహాయం కోసం ఏ వర్గం ప్రజలు నాయకులు వెళ్ళొద్దని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు ఒక్క తాటిపైకి రావాలన్నారు. దీనికోసం అన్ని వర్గాలు కలిసి నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్ పేరుతో పార్టీ ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. రానున్న ఎన్నికల్లో పాల్గొనేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌పీజేఎఫ్ రామగుండం కన్వీనర్ గోపాల్, వివిధ సంఘాల నాయకులు ఆంజనేయులు గౌడ్, ఉపేందర్, పొన్నాల నారాయణ, మారుతి పటేల్, శంకర్, కోట వెంకన్న, ప్రహ్లాద్, మధుకర్, కడ్తల మల్లయ్య, దివాకర్ గౌడ్ పాల్గొన్నారు.



సొంత ఖర్చులతో రోడ్డు బాగు చేయించిన యువకులు

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని ప్రధాన రోడ్లు గుంతల మయంగా మారి అధ్వానంగా తయారు కావడంతో ఇటీవల మండల స్థాయి అధికారులతో పాటు కలెక్టర్‌కు మండల యువకులు రోడ్లు బాగు చేయించాలని వినతిపత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడంతో విసిగిపోయిన మండల యువకులు తమ సొంత డబ్బులతో రోడ్డును బాగు చేసుకున్నారు. మండల కేంద్రం నుండి కలవాడకు వెళ్లే రోడ్డు నల్లచెరువు వద్ద పూర్తిగా చెడిపోవడంతో ట్రాక్టర్ల సహాయంతో కంకర పోయించి బాగు చేయించినట్లు పేర్కొన్నారు. మండలంలోని ఏ గ్రామంలో కూడా రోడ్డు రవాణా వ్యవస్థ సక్రమంగా లేదని అధికారులు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు.





ప్రభుత్వ భూములు కాపాడాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో అక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ(ఎం) నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముంజం ఆనంద్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పట్టణంలోని విలువైన భూములను కొంతమంది దళారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా కబ్జాలు చేస్తున్నారని, ఇవి వార్తా పత్రికలలో వస్తున్నా కలెక్టర్ కనీసం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. ఒకవైపు మున్సిపాలిటీకి ఆదాయం లేక కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఉంటే, మరోవైపు ఖాళీగా ఉన్న మున్సిపల్ స్థలాలను కూడా కాపాడుకోలేని దుస్థితిలో పాలకవర్గం, అధికారయంత్రాంగం ఉందని ఆరోపించారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు.

ఎమ్మెల్సీని కలిసిన తెలంగాణ జన సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉద్యమ రథసారథి ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా తెలంగాణ జన సమితి కామారెడ్డి జిల్లా తరపున కలిసినట్టు జిల్లా అధ్యక్షుడు కుమ్మల లక్ష్మణ్ యాదవ్ అన్నారు. తెలంగాణ జన సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కుంభాల లక్ష్మణ్ యాదవ్ ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి సన్మానించారు. రాబోయే రోజుల్లో కోదండరాం మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమ్మెబాట

- ఆరోగ్య మిత్రుల డిపిఓ క్యాడర్‌ను తక్షణమే కల్పించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

రాజీవ్ ఆరోగ్య శ్రీ ఆరోగ్య మిత్ర సమ్మె పిలుపులో భాగంగా కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి ఆరోగ్యమిత్రాల తమ సమస్యలపై సమ్మె నోటీసును ఆదివారం అందజేసినట్టు రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అల్లావుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినట్టు వివరించారు. ముఖ్యంగా లిఫ్ట్ ఆపరేటర్ కేడర్ నుండి డిపిఓ క్యాడర్‌గా చేంజ్ చేయాలనీ, అదే విధంగా ఉద్యోగ భద్రత కల్పించి వేతన సవరణ చట్టం 60జిఓ ప్రకారం కనీసం 22,750 జీతం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యేకు ఆరోగ్య మిత్రలు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందించి ఆరోగ్యమిత్రల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని వివరించారు. ఆరోగ్య మిత్రలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని వివరించారు. సమస్యలను పరిష్కరించకపోవడంతో తప్పని పరిస్థితిలో ఈనెల 20 నుండి రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సమ్మె బాట పడతామని ఆరోగ్యమిత్రలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్రలు గంగాధర్, అనిల్, నిర్మల, నరసవ్వ, మహేష్, కృష్ణ వర్ధన్, శివాజీ, సంతోష్, సాయిబాబా, జనని రాణి, కాశమని, సురేఖ, క్రాంతి కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు లాండె భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఇందూరి సిద్దాగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కుల కోసం ప్రభుత్వం పెద్దపీట వేయాలని అన్నారు. జర్నలిస్టులపై పెరుగుతున్న ఒత్తిడిలను అధిగమించేందుకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అన్ని విధాలుగా సహకరిస్తుందని, ప్రతి ఒక్క జర్నలిస్ట్‌కు ప్రాధాన్యత కల్పించే విధంగా సహాయ సహకారాలు అందించనున్నట్టు వివరించారు. నూతనంగా కామారెడ్డి జిల్లా అధ్యక్షులుగా ముద్ర కోలా నర్సింలును సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా డి.కృష్ణారావు, ఆర్.రామ్మూర్తి, కె.హరీష్, ప్రవీణ్‌కుమార్, జనరల్ సెక్రెటరీగా అఖిల్‌రెడ్డి, కోశాధికారిగా నీల వెంకటి, ముఖ్య సలహాదారులుగా ఎం.సాయిలు, జె.శ్రీనివాస్, ఎస్.మురళి, జి.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ అబ్రబోయిన శ్రీను, శ్రీకాంత్‌గౌడ్, రాజు, ఆశన్న, వెంకటేష్ కుమార్, సుమారు 40 మంది అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి, నిర్దాక్షిణ్యంగా హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి, శిక్షించాలనీ, ఆమె కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జూనియర్ డాక్టర్ల నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అన్నారు. మహిళలకు రక్షణ కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్లు చేసే పోరాటానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్, కోశాధికారి కె.కిష్టన్న, జిల్లా కార్యదర్శులు ఎ. ఇస్తారి, కె. శ్రీనివాస్, గౌస్ మొహియుద్దీన్, సి.విలాస్, శివన్న, కె. శంకర్, మహిళా ప్రతినిధులు కె.శ్రీలత, ఆర్.మీరా, డి.రజిని, అనిత, శ్రీవాణి, సువర్ణ, సరిత, శివలీల వివిధ మండలాల బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిటకిటలాడిని ప్రధాన వీధులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారులు కిటకిట లాడాయి. పండగను పురస్కరించుకుని మార్కెట్లోకి వివిధ రకాల రాఖీలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో పట్టణంలోని దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. బంగారు, వెండి రాఖీలతో పాటు కార్టూన్ బొమ్మలతో ఉన్న రాఖీలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. సోమవారం రాఖి పండగ జరుపుకోనున్న నేపథ్యంలో తమ అన్నదమ్ముల్లకు రాఖీలు కొనుగోలు చేయడానికి మహిళలు, యువతులు భారీగా తరలివచ్చారు. పట్టణంలోని గాంధీ చౌక్, అంబేద్కర్‌చౌక్, అశోక్ రోడ్, వినాయక్‌చౌక్ తదితర ప్రధాన కూడళ్లలో ప్రత్యేకంగా దుకాణాలు వెలిశాయి. తమ అన్నదమ్ములకు అందమైన రాఖీలు కొనుగోలు చేయడానికి మహిళలు, యువతులు ఆసక్తి చూపగా, చిన్నారులు తమకు ఇష్టమైన రాఖీలను కొనుగోలు చేసి సంబరపడ్డారు.

ముగిసిన పద్మశాలి సంఘం ఎన్నికలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికలు ఆదివారం కాగజ్‌నగర్‌లో నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుని ఎన్నిక కోసం ఈ ఎన్నికలు స్థానిక శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించారు. ఈ ఎన్నికలలో 196 ఓట్లకు గాను 72 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎక్కలదేవి నాగరాణి, ప్రిసైడింగ్ అధికారిగా దాసరి శ్రీకాంత్, పోలింగ్ ఆఫీసర్‌గా కొంగ సంపత్, బూర నిఖిల్‌లు వ్యవహరించారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగింది. ఎన్నికల సామాగ్రిని హైదారబాద్‌లోని కౌంటింగ్ హాలుకు తరలిస్తున్నామని, సోమవారం వనస్థలిపురంలోని కర్నాటి ఫంక్షన్ హాలులో కౌంటింగ్ నిర్వహించనున్నట్లు జోనల్ అధికారి గోలి వినోద్‌కుమార్ తెలిపారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కుటుంబానికి అండ



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి కాట్‌పల్లి ఆనంద్‌రెడ్డి రీజినల్ మేనేజర్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న కాళిదాస్ కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. కాళిదాస్ భార్య కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి ఆనంద్‌రెడ్డి ఆర్థిక సాయం చేసి అండగా నిలిచాడు. మానవత్వం చాటుకొని కుటుంబానికి అండగా నిలిచిన ఆనంద్‌రెడ్డిని పలువురు అభినందించారు.

ఎంపీటీసీ నిధులతో బోరుబావి తవ్వకం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని మల్లయ్యపల్లి గ్రామంలో బోరు వేయించినట్లు ఆదివారం తాజా మాజీ సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని ఇటీవల స్థానిక ఎంపీటీసీ సంతోష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి ఎంపీటీసీ నిధులతో శనివారం నాడు రాత్రి గ్రామంలోని జీపి భవనం సమీపంలో బోరు వేయించారని, బోర్ బావిలో నీరు పుష్కలంగా వచ్చాయని అన్నారు. వెంటనే 24 గంటలు గడవకముందే బోరు మోటారు పంపు బిగించి నీటిని సరఫరా చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీటీసీ కృషితో గ్రామంలో నీటి సమస్య పరిష్కారమైందని పలువురు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీపి సిబ్బంది, స్థానిక గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.